మారెమ్మ బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి పుట్లూరు మారెమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు
- 6 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు
- రేపు రాత్రి భజన పోటీలు, 25న రాత్రి గాయని మధుప్రియతో జానపద కచేరి
- మూడు రోజులు అంతర్ రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు
- రెండు రాష్ట్రాల నుంచి పాల్గొననున్న భక్తులు

కృష్ణగిరి: భక్తుల ఆరాధ్య దైవం, కొలిచే వారికి కొంగు బంగారమైన పుట్లూరు మాతా మారెమ్మ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు రేపటి (ఆదివారం) నుంచి 29వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు రాయలసీమ జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామంలోని హంద్రీ నది బద్దున వెలసిన అమ్మవారికి ఏటా బాద్రపద శుక్ల చతుర్థి మొదలుకొని బహుళ చవితి వరకు అమ్మవారి బ్రహ్మోత్సవాలు జరిపేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ గ్రామం వెల్దుర్తి నుంచి కృష్ణగిరికి వెళ్లే దారిలో చెరుకులపాడు గ్రామం దాటిన వెంటనే ప్రధాన రహదారికి అనుకుని ముఖద్వారం ఉంది. ఈ ముఖద్వారం నుంచి రెండు కిలోమీటర్లు వెళితే పుట్లూరు గ్రామం వస్తుంది.

ఇక్కడి ప్రత్యేకత

ఇక్కడి అమ్మవారికి భక్తులు సమర్పించిన టెంకాయలు, మొక్కులు తీర్చుకున్న సమయంలో ప్రసాదాలు తదితర ప్రసాదాలు గ్రామం పొలిమేర దాటి వెళ్లకూడదు. ఇదే ఆచారం గత 200 ఏళ్లుగా కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు. పొరబాటున తీసుకెళితే గ్రామ పొలిమేర దాటేలోగా వారికి కీడు జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం.



గ్రామ శివారులోని ముఖద్వారం

అమ్మవారి చరిత్ర

201 ఏళ్ల క్రితం గ్రామానికి అనుకుని ఉన్న పాల హంద్రీలో అమ్మవారి ప్రతిమ వరదలో బయటపడడంతో గుర్తించిన పెద్దలు హంద్రీ ఒడ్డున అమ్మవారిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతేడాది అమ్మవారికి తిరునాల జరుపుకుంటూ వస్తున్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల కొర్కెలు తీరుతుండటంతో ప్రతి మంగళవారం అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు భారీగా వస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామస్తుల సహకారంతో గత 18 ఏళ్లుగా మూడు నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు జరుపుతున్నారు. గత నాలుగేళ్లుగా 6 రోజుల బ్రహ్మోత్సవాలు జరిపేందుకు కమిటీ సభ్యులు సిద్ధం చేస్తున్నారు.

ఆరు రోజులపాటు కార్యక్రమాలు

- రేపు (ఆదివారం) గ్రామ శివారులోని ముఖద్వారం వద్ద పూజలతో జాతర ప్రారంభం అవుతుంది. ఇదే రోజు ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలను అందించనున్నారు.



మారెమ్మ అమ్మవారి మూలవిరాట్

- 25న అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు పొట్టేళ్ల పోటీలు నిర్వహించి గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.15 వేలు, రూ.12.5 వేలు, రూ.10 వేలు, రూ.7.5 వేలను అందిచనున్నారు. అలాగే ఉదయం 11 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 9 గంటలకు ప్రముఖ గాయని మధుప్రియ, మానుకోట ప్రసాదు, మద్యల సందీప్‌లతో జానపద కచేరి నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.
- 26న అమ్మవారిని ప్రత్యేక నగలతో అలంకరించి ప్రతి ఇంటి నుంచి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకునే కార్యక్రమం ఉంటుంది.

మూడు రోజుల పాటు బండలాగుడు పోటీలు

- 27న పాలపండ్ల విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ. 25 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు అందించనున్నారు.
- 28న న్యూ కేటగిరీ విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు ప్రదానం చేస్తారు.
- 29న సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలను అందించనున్నట్లు వారు తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొనే వారు 86393 63721, 75693 90793, 95738 88304 ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఆరు రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

రూ. 4 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం

మాతా మారెమ్మ అమ్మవారి నూతన ఆలయాన్ని గ్రామస్తులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. తిరుపతికి చెందిన శిల్పుల చేత దాదాపు రూ.4కోట్ల ఖర్చుతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తి కావడానికి మూడేళ్లు పడుతుందని వారు తెలిపారు. గత కొన్నేళ్లుగా అమ్మవారికి వస్తున్న కానుకలతోపాటు, గ్రామస్తుల చందాలు, ఇతర ప్రాంతాల భక్తుల విరాళాలతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

పశువుల దాణా పంపిణీ



పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: ప్రభుత్వం రాయితీ ద్వారా అందించే పశువుల దాణాను స్థానిక పశు వైద్యశాలలో ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య, గ్రామ సర్పంచ్ దాసరి గోవిందరాజులు ఆధ్వర్యంలో శుక్రవారం పాడి రైతులకు పంపిణీ చేశారు. 200 కేజీల దాణా ధర రూ.3160 కాగా ప్రభుత్వ రాయితీతో రైతులకు రూ.1300 కే అందిస్తున్నట్లు పశువైద్యాధికారి ప్రసన్నా బాయ్ తెలిపారు. ప్రస్తుతం మండలానికి 120 క్వింటాళ్ల దాణా వచ్చినట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి బాలన్న, పశు వైద్యశాల సిబ్బంది నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

ఆలూరు: గ్రామ పంచాయతీలలో ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పత్తికొండ రెవెన్యూ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలను ఆదేశించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ ఆరోగ్య సురక్ష, తాగునీటి సదుపాయం, మురుగునీటి పారుదల, చెత్త, చెదారం, డంపింగ్ యార్డు, చెత్త నిర్వహణ కేంద్రం తదితర కార్యక్రమాలపై సిబ్బందితో ఆయన శుక్రవారం చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సీజనేల్, అంటురోగాల బారిన పడకుండా ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. మురుగు నీటి నిల్వ ఏర్పడకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీకి పెండింగ్‌లో ఉన్న బకాయిలను బిల్‌కలెక్టర్లు వసూలు చేయాలని ఆదేశించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ

చిప్పగిరి: మండలంలోని గుమ్మనూరు కొట్టాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులు ప్రమాదవశాత్తు గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ శుక్రవారం ఆ కుటుంబ సభ్యులకు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో తనవంతుగా సాయం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక నాయకులు శ్రీధర్, రాజన్న, సతీష్, తదితరులు ఉన్నారు.

పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించాలి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మద్దికెర: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం అందించడమే గాకుండా వారిలో సృజనాత్మకతను పెంపొందించాలని సీడీపీఓ సావిత్రిదేవి అన్నారు. శుక్రవారం మద్దికెరలో పోషణ మహోత్సవాలలో భాగంగా పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు ఊహ, సామర్థ్యం, శారీరక పెరగుదల, మానసిక వికాసానికి ఆటలు ముఖ్యమన్నారు. చిన్నారులు తమ చుట్టూ ఉన్న ప్రపంచంలో నిమగ్నమై ఉండి ఎదుగుతారన్నారు. సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, టీచర్లు శ్రీదేవి, పద్మజ, విశాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూకు భారీ ధర



వేలంలో దక్కించుకున్న లడ్డూతో నాగరాజు

ఎమ్మిగనూరుటౌన్: వినాయకచవితి సందర్భంగా పట్టణంలోని తేరుబజారు నందు ప్రతిష్ఠించిన గణపతి లడ్డూకు వేలంలో భారీ ధర లభించింది. గురువారం వినాయక నిమజ్జనం సందర్భంగా వినాయక మండలి వారు రాత్రి లడ్డూ వేలం పాట నిర్వహించగా స్థానిక నందిపైప్స్ నిర్వాహకులు రూ.91 వేలకు దక్కించుకున్నారు. ఈ ఏడాది వేలం పాటలో లడ్డూను దక్కించుకోవడం సంతోషంగా ఉందని నందిపైప్స్ యజమానులు నాగరాజు, శ్రీనివాసులు, నరేంద్ర, వీరేష్ పేర్కొన్నారు. వినాయక మండలి నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పోనకలదిన్నె, సోమలగూడూరు, నాగలదిన్నె గ్రామాల్లో గృహ నిర్మాణాలు, గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీలకు ప్రభుత్వం రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం, డ్రైయినేజీలు వంటి మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇంటి బిల్లు కూడా దశలవారీగా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు వివరించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హౌసింగ్ ఏఈ గురుస్వామి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



నాగలదిన్నెలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి: ఆంధ్రప్రదేశ్ గట్కా చాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 17న తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరిగిన అండర్-14, 18 విభాగంలో తమ విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందన్నారు. 9వ తరగతి విద్యార్థినులు మమత, లావణ్య బంగారు పతకాలు, అలాగే హారిక, జాస్మిన్, ఎస్తేర్‌రాణి, 10వ తరగతి విద్యార్థిని కల్యాణి వెండి పతకాలు, హరిప్రియ, స్వాతి, అనూష, హారిక మంజుల మూడో స్థానంలో నిలిచి కాంసత్య పతకాలు సాధించినట్లు ఆమె తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, పీఈటీ సుప్రియను శుక్రవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం తెర్నెకల్ పీహెచ్‌సీ వైద్యులు అరుంజ్యోతి, ఇదయతుల్లా పరిశీలించారు. ఏఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. ప్రతిఒక్కరి ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. అలాగే గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే-డ్రైడేను పరిశీలించారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉన్న ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలవ్యాప్తిని అరికట్టేందుకు ప్రతిఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వీరి వెంట సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, ఎంపీహెచ్‌ఈఓ రంగస్వామి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తున్న వైద్య సిబ్బంది

చిరుత కలకలం

పత్తికొండ రూరల్: పత్తికొండ-చక్రాళ్ల రోడ్డులోని కొండ ప్రాంతంలో చిరుత సంచారం శుక్రవారం కలకలం రేపింది. రైతుల నుంచి విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారి రామ్మోహన్ కొండ ప్రాంతంలోని పొలాల వద్ద పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గతంలో కొన్నినెలల క్రిందట ఈ ప్రాంతంలో చిరుత పాదముద్రలను ఫారెస్టు అధికారులు సేకరించారు. తరువాత కొంతకాలం చిరుత జాడ కనిపించలేదు. తాజాగా చిరుత సంచారంతో రైతులు పొలానికి ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. చిరుత సంచారంపై నిఘా ఏర్పాటు చేసి అవసరమైతే ఉన్నతాధికారుల సూచనల మేరకు బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చెప్పారు.



పత్తికొండ-చక్రాళ్ల రోడ్డులోని కొండపై చిరుత

వైద్య శిబిరం పరిశీలన

మద్దికెర: మండల కేంద్రంలో ప్రవాస భారతీయులు ప్రేమసాగర్ రెడ్డి, వెంకమ్మ రెడ్డి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తహసీల్దార్ నాగభూషణం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి వైద్యశిబిరాలు నిర్వహించడం అరుదుగా జరుగుతుందన్నారు. కంటి పరీక్షలు అయిన వెంటనే మొబైల్ ఆపరేషన్ చేయడం వల్ల ప్రజలకు దూర ప్రాంతాలకు వెళ్లే శ్రమ తగ్గుతుందన్నారు. అంతేగాక 10 రోజుల పాటు వైద్యశిబిరం నిర్వహించడం వల్ల దృష్టి లోపం ఉన్న వారికి ఎంతగానో మేలు కలుగుతుందన్నారు. మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వర రెడ్డి, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగభూషణం

గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందాం

హొళగుంద: గ్రామాలను శుభ్రంగా ఉంచుకుని ప్రజలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకర సమాజాన్ని అందిద్దామని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం హొళగుంద పంచాయతీ కార్యాలయం వద్ద క్లాప్ మిత్రను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ.. గ్రామాలలో పరిశుద్ధ్యం లోపించకుండా చెత్త చెదారం వీధుల్లో వేయకుండా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి తాముంటున్న నివాసాలతో పాటు పరిసరాలు శుభ్రంగ ఉంచి ప్రతిఒక్కరు గ్రామాభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. చెత్తచెదారం, మురుగునీరు, డ్రైనేజీల ఏర్పాటు ఇతర పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక యంత్రాలు, ఇతర సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పంపాపతి తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా చంద్రరేఖ

కృష్ణగిరి: మండల ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా చంద్రరేఖను నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపీడీఓ విశ్వమోహన్ తెలిపారు. ఇదివరకు పత్తికొండ హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్ ఇన్‌చార్జ్ ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కృష్ణగిరి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రరేఖకు ఇన్‌చార్జ్ ఏఈ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చంద్రరేఖ మాట్లాడుతూ.. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా, అర్హులైన వారందరికీ బిల్లులు సకాలంలో అందేలా సిబ్బంది సహకారంతో పని చేస్తానని పేర్కొన్నారు.

24 నుంచి దక్షిణామూర్తి ఆరాధనోత్సవాలు



దక్షిణామూర్తి స్వామి

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో ఈ నెల 24 నుంచి దక్షిణామూర్తి స్వామి 31వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. 24వ తేదీన ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి భజన పోటీలు

దక్షిణా మూర్తి ఆరాధనోత్సవాల సందర్భంగా ఈనెల 24వ తేదీన రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు చెప్పారు. గెలుపొందిన వారికి 1 నుంచి 12 బహుమతులు వరుసగా రూ.15,116, రూ.12,116, రూ.9,116, రూ.7,116, రూ.6,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116, రూ.2,516, రూ.2,016, రూ.1,616, రూ.1,116 ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీలో పాల్గొనే వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 87902 42809, 80745 08537 నంబర్లను సంప్రదించాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవక వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు చేతికి రాక నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణగౌడ్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వర్షాలు కురవక పంటలు పూర్తిగా ఎండిపోయాయని దీంతో ఈ ఖరీఫ్ రైతులకు అప్పులు మిగిల్చిందన్నారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, జిల్లా నాయకులు భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

తుగ్గలి: ఈనెల 29న విజయవాడలో తలపెట్టిన దళిత రక్షణ మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ పిలుపునిచ్చారు. దళితుల ఆత్మగౌరవం, ఉపాధి, సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకై చేపట్టిన దళిత రక్షణ జీపు జాత యాత్ర శుక్రవారం రాత్రి ఎద్దులదొడ్డి, తుగ్గలిలో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలను ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. దళిత హక్కుల కోసం చేపట్టే రక్షణ మహాధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, కేవీపీఎస్ మహిళా అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

వెల్దుర్తి: మండల కేంద్రానికి 30 కి.మీ దూరంలో కొండలపై ఏర్పడి అభివృద్ధికి నోచుకోని చిన్నకొలుముల పల్లె గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని శుక్రవారం సాయంత్రం అమరావతి వెలగపూడి అసెంబ్లీ కార్యాలయం ఆవరణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విన్నవించినట్లు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. దశాబ్దాలుగా చిన్నకొలుములపల్లె గ్రామస్తులు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ గ్రామానికి వెళ్లాలంటే బేతంచెర్ల మండలంలోని గ్రామాలు దాటి ఫుట్ రోడ్డులో ప్రయాణించాల్సి ఉందని వివరించారు. వెల్దుర్తి నుంచి గ్రామానికి రహదారి ఏర్పాటు చేయడం ద్వారా గ్రామాభివృద్ధి, సౌకర్యాల కల్పనకు సాధ్యమవుతుందన్నారు. రోడ్డు నిర్మాణం కోసం రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎంకు విన్నవించినట్లు ఆమె తెలిపారు.



చిన్నకొలుములపల్లెలో మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి (ఫైల్)

ఎమ్మార్సీ, కేజీబీవీల పరిశీలన



విద్యార్థినులను ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతున్న ఐఈడీ డైరెక్టర్ అండ్ కో-ఆర్డిటర్ సాయిరాం మోహన్

హాలహర్వి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ, కేజీబీవీ పాఠశాలలను ఐఈడీ డైరెక్టర్ అండ్ కో-ఆర్డినేటర్ సాయిరాంమోహన్ సందర్శించారు. విద్యార్థులు చదువులో రాణించేలా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి విద్యార్థికి అందేలా చూడాలన్నారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలను ఎప్పటికప్పుడు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. నాడు-నేడు పథకం కింద జరుగుతున్న పనులను హెచ్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కేజీబీవీలో విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈయన వెంట ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాస రెడ్డి, హాలహర్వి పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ ఉన్నారు.

లారీ బోల్తా పడి క్లీనర్ దుర్మరణం

పత్తికొండ రూరల్: పత్తికొండ-రాతన రోడ్డులోని మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ప్రకాశం జిల్లా కురిచేడు గ్రామానికి చెందిన బుడ్డబాషా (32) దుర్మరణం చెందగా డ్రైవర్ షేక్ నాగూర్‌వలి తీవ్రంగా గాయపడ్డాడు. బావ, బామ్మర్దులైన వీరిద్దరూ గత కొంతకాలం నుంచి క్లీనర్, డ్రైవర్‌గా లారీ ద్వారా సరుకు రవాణా చేస్తుండేవారు. కందుకూరు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బందేలికి సుబాబుల్ లోడ్‌తో లారీ బయల్దేరింది. అయితే పత్తికొండ-రాతన గ్రామాల మధ్య మలుపు వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ప్రమాదంలో క్లీనర్ బుడబాషా లారీ కింద పడి దుర్మరణం పాలయ్యాడు. డ్రైవర్ షేక్ నాగూర్‌వలి తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



లారీ కిందపడి చిద్రమైన క్లీనర్ బుడ్డ బాషా మృతదేహం

ఆదర్శ మండలంగా నిలవాలి

మద్దికెర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకొని మండలం జిల్లా స్థాయిలో పురోగతి సాధించి ఆదర్శంగా నిలవాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక కమ్యునిటీ హాలులో మండలంలోని ఆయా శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, జలవనరులు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నెలరోజుల పాటు గ్రామాలలో సభలు నిర్వహించి సంక్షేమ పథకాలు, గ్రామాల్లో కావాల్సిన వసతుల గురించి తెలియజేయడం జరిగిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్థికాభివృద్ధికి అధికారులు కూడా తమ వంతు సహకారం అందించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసే యూనిట్లు గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని, ఏఓ రవి, ఎంఈఓ రంగస్వామి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంపీటీసీలు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి

ఎస్సీ వర్గీకరణతోనే సమన్యాయం



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, వివిధ సంఘాల నాయకులు

గోనెగండ్ల: ఎస్సీ వర్గీకరణ ద్వారానే ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గోనెగండ్లలో చేపట్టిన నిరహార దీక్ష శుక్రవారం ముగిసింది. ఈ దీక్ష చివరి రోజు బేడ, బుడగజంగాలు, వికలాంగులు, ఎరుకల సంఘం, డప్పు కళాకారుల సంఘాలు మద్దతు తెలిపాయి. అనంతరం ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ 59 ఉప కులాలలో రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు, జనాభా దామాషా ప్రకారం అమలు జరగాలని జాతీయ కమిషన్లు కేంద్రానికి నివేదికలు సమర్పించినప్పటికీ నాడు కాంగ్రెస్, నేడు బీజేపీ పార్టీలు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయా సంఘాల నాయకులు సోమన్న, నాగశేషమ్మ, సరోజమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భూరక్ష సర్వే వేగవంతం

ఆలూరు రూరల్: జగనన్న భూ హక్కు - భూ రక్ష సర్వే వేగవంతం చేసినట్లు మండల తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే మండలంలోని కాత్రికి, గోనేహాల్ గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే పూర్తి చేసి భూ యజమానులకు హక్కు పత్రాలు అందించామన్నారు. రెండో విడతలో భాగంగా కురువళ్లి, మూసానహళ్లి, తుంబళబీడు, మరకట్టు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 70 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. భూ సర్వే జరిగే గ్రామాల్లో ప్రజలు సిబ్బందికి సహకరించాలన్నారు. సర్వే పూర్తయితే భూ వివాదాలు ఉండవని స్పష్టం చేశారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

తుగ్గలి: రైతులంతా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పీఎం కిసాన్ 15వ విడత నగదు త్వరలో జమ కానుందని ఆ లబ్ధి పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అన్నారు. మండలంలో ఇప్పటి వరకు 16,017 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 320 మంది నాలుగైదు రోజుల్లో ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. లేకపోతే పీఎం కిసాన్ నగదు జమ కాదని స్పష్టం చేశారు.

పప్పుశనగ విత్తనాలు మంజూరు

మద్దికెర: మండలానికి 1800 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు మంజూరైనట్లు ఏఓ రవి శుక్రవారం తెలిపారు. 2 వేలు క్వింటాళ్ల విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపగా ప్రస్తుతం ఆ మేరకు మంజూరైనట్లు చెప్పారు. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ధర, సబ్సిడీ ప్రకటించి ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.